క్లుప్తంగా

మలేరియా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో గల తన చాంబర్లో మలేరియా మాసోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో దోమలు ఉత్పత్తి చెందే అవకాశం ఉన్నందున, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఫ్రైడే- డ్రై డే గా పాటించాలని, నీటి నిల్వలు పరిసర ప్రాంతాల్లో లేకుండా చూసుకోవాలని, పూల కుండీలు, రిఫ్రిజిరేటర్ లోని నిల్వ ఉన్న నీరు, టైర్లు, ఖాళీ తొట్లు, రుబ్బురోళ్లు, పాడైపోయిన బకెట్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు శివరామకృష్ణ, సలీం, సోమరాజు, రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శాఖా గ్రంథాలయంలో కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఇందిరా మహిళా మండలి, లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు మాధవీ లత, రామకృష్ణాపురం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అప్పారావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జనార్దనరావు లైబ్రేరియన్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి రూ.10 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమానికి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సముద్రాల వెంకట రమణ రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్‌తో కలిసి ఆశాజ్యోతి ఆశ్రమాన్ని సందర్శించారు. శారీరక, మానసిక దివ్యాంగులు, అనాథ బాలలకు ఆశాజ్యోతిలో అందిస్తున్న సదుపాయాలను వెంకట రమణ పరిశీలించారు. ఎంతో ఓర్పుతో దివ్యాంగులు, అనాథ బాలలకు వసతి సదుపాయాలు కల్పిస్తున్న నిర్వాహకులను అభినందించారు. తనవంతుగా ఆశాజ్యోతి ఆశ్రమానికి రూ.10 లక్షల విలువైన చెక్కును అందించారు. భవిష్యత్‌లోనూ తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. భారీ విరాళాన్ని అందించినందుకు ఆశాజ్యోతి వ్యవస్థాపకుడు మరీదు వెంకట స్వామి, కరస్పాండెంట్ మల్లవల్లి మాధవీలత కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సముద్రాల వెంకట రమణ జన్మదినాన్ని దివ్యాంగ చిన్నారుల సమక్షంలో జరుపుకొన్నారు. అనంతరం ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సముద్రాల వెంకట రమణ కుమార్తె భానురేఖ, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యాంటీబయోటిక్స్ అవసరానికి మించి వాడితే ప్రమాదం

గన్నవరంరూరల్: మండలంలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో శుక్రవారం యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పై ఫ్రంట్ లైన్ వర్క్‌షాప్ జరిగింది. డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు టెలిమెడిసిన్ హాల్‌లో జరిగిన సదస్సులో సోనీపట్ అశోక యూనివర్శిటీ రీసెర్చ్ ఫ్యాకల్టీ ఫెలో డాక్టర్ శ్రద్ధా కార్వే, మైక్రోబయాలాజికల్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీవల్లి భాగవతుల, హైదరాబాద్ మాగ్న సెంటర్స్ పీడియాట్రీషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ ముఖ్య వక్తలుగా పాల్గొని దిశా నిర్దేశం చేశారు. అవసరానికి మించి యాంటీబయోటిక్స్ వాడకం ప్రమాదకరమని, భావి వైద్యులు దీన్ని గుర్తించాలన్నారు. సరైన కోర్సు మందులు వాడకపోతే బ్యాక్టీరియా రూపాంతరం చెందడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ పరిస్థితుల నివారణకు కచ్చితమైన నిర్ధారణ ముఖ్యమన్నారు. యాంటీబయోటిక్, యాంటీ ఫంగల్, యాంటీ వైరస్ మందులను అనవసరంగా వాడడాన్ని నిరోధించాలన్నారు.యాంటీబయోటిక్స్ సరైన వాడకం, నిర్లక్ష్యం, దుష్ఫలితాలపై అవగాహన నిర్వహించారు. వైద్య విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఏఎంఆర్ విస్తరణ నిరోధించటం వైద్యుల బాధ్యత, లక్ష్యంగా గుర్తించాలన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేజర్ ఎంవీ భీమేశ్వర్, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ స్వాతి పూర్ణిమ, వైద్యులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో వాంబేకాలనీ ‘జీ’ బ్లాక్

- తాగునీరు లేక అవస్థలు
- డ్రెయినేజీ లీకులతో భరించలేని దుర్వాసన
- ఆవరణ అంతా చెత్తా చెదారం
- రాత్రుళ్లు గంజాయి బ్యాచ్.. దొంగల ముఠా హల్‌చల్
- 59, 60 డివిజన్లకు సరిహద్దు కావడంతో అభివృద్ధికి నోచుకోని వైనం



వాంబే కాలనీ జీ బ్లాక్ అపార్ట్‌మెంట్లు



బోరింగ్‌లే శరణ్యం..

బోరింగ్ నీటిని పట్టుకుంటున్న స్థానికులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వాంబేకాలనీ జీ బ్లాకు... ఈ పేరు వింటేనే స్థానిక ప్రజలు హడలిపోతున్నారు. తాగేందుకు నీరు లేక.. ఉండేందుకు సరైన సదుపాయాలు లేక.. మురికి కూపంలో.. చెత్తాచెదారాల మధ్య, కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమల నడుమ దుర్భర జీవనం గడుపుతున్నారిక్కడి నివాసితులు.

ఎక్కడ చూసినా డ్రెయినేజీ కంపు

స్థానిక 59వ డివిజన్‌కు 60వ డివిజన్‌కు సరిహద్దు ప్రాంతంగా వాంబేకాలనీ జీ బ్లాక్ అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. ఇక్కడ మొత్తం 8 బ్లాకుల్లో 256 కుటుంబాల వరకూ జీవనం సాగిస్తున్నాయి. ఈ జీ ప్లస్3 అపార్ట్‌మెంట్‌ల చుట్టూ ఎక్కడ పడితే అక్కడ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లీకేజీలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఆ మురుగు నీరంతా ఇక్కడ అపార్ట్‌మెంట్‌ల ముందు నిత్యం పారుతూనే ఉంటుంది. వీటి నుంచి వస్తున్న దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల గగ్గోలు విని ఇటీవల కార్పొరేషన్ అధికారులు యూజీడీ పైపులైను లీకులకు మరమ్మతులు చేయించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు.

తాగునీటికి కటకట

నిరుపేద ప్రజలు అత్యధికంగా జీవిస్తున్న ఈ అపార్ట్‌మెంట్స్‌లో తాగునీటి కోసం ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎనిమిది బ్లాకులకు సంబంధించి కేవలం రెండు మంచినీటి కుళాయిలే ఉండడం,



అపార్ట్‌మెంట్ లోపల పడి ఉన్న మద్యం సీసాలు

వచ్చే పంపులు అరగంటకు మించి పెద్దగా రాకపోవడం, వచ్చినా సన్నధార వస్తుండడంతో అవి ఎవరికీ సరిపోవడం లేదు. అపార్ట్‌మెంట్‌ల ప్రారంభంలో కింద భాగంలో మాత్రమే ఈ కుళాయిలు ఉండడంతో వెనుక భాగంలో ఉన్న బ్లాకుల వారు మంచినీళ్లు కావాలంటే ఆ అపార్ట్‌మెంట్‌లను దిగి ఈ చివరి వరకూ వచ్చి నీళ్లు పట్టుకొని మోసుకుని వెళ్లాల్సివస్తుంది. స్థానిక ప్రజల నీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో ఇక్కడ మూడు బోరింగ్ పంపులను ఏర్పాటుచేయడంతో స్థానిక ప్రజలకు అవే ఆధారంగా మారాయి. అయితే వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మంచినీళ్లు పట్టుకోవాలంటే మాత్రం చాలా కష్టతరంగా ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

గంజాయి బ్యాచ్.. దొంగల హల్‌చల్...

జీ బ్లాక్ అపార్ట్‌మెంట్స్ గంజాయి బ్యాచ్‌కు, దొంగలకు, ఆకతాయిలకు నివాస ప్రదేశాలుగా మారిపోయాయి. చీకటి పడితే చాలు పదుల సంఖ్యలో గంజాయి బ్యాచ్ సభ్యులు ఇక్కడి అపార్ట్‌మెంట్స్ గోడల మీద, బెంచీల మీదకు చేరుకుని తెల్లవార్లూ మద్యం తాగడం గంజాయి పీల్చడం, అల్లర్లకు పాల్పడడం చేస్తున్నారు. అదేమని ఎవరైనా అడిగితే వారిపై దాడులకు పాల్పడుతూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రాత్రి సమయాలలో ఇళ్లల్లోకి చేరి సెల్‌ఫోన్లు, ఇళ్లల్లో వస్తువులు, వాహనాల్లో పెట్రోల్ దొంగిలిస్తున్నారని వాపోతున్నారు.

ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు

తమ సమస్యలను 59వ డివిజన్ కార్పొరేటర్‌కు చెప్పుకోవాలో, 60వ డివిజన్ కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లాలో తమకు అర్థం కావడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రం రెండు డివిజన్లకు చెందిన నాయకులు వచ్చి తమ పార్టీలకు ఓట్లేయమని వెంటబడ్డారని, ఇప్పుడు సమస్యలను విన్నవించుకునేందుకు వెళ్తుంటే ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని కలత చెందుతున్నారు. తమకు సమీపంలో వాంబే కాలనీలో ఉన్న 60వ డివిజన్ కార్పొరేటర్‌కు వెళ్లి చెబుతుంటే తనకు సంబంధం లేదని అంటున్నారని, పోనీ సింగ్‌నగర్‌కు వెళ్లి 59వ డివిజన్ కార్పొరేటర్‌కు చెబుదామంటే అంత దూరం వెళ్లలేక ఊరుకుంటున్నామని కన్నీరుమున్నీరవుతున్నారు.

మౌలిక వసతులు కల్పించి.. రక్షణ చర్యలు చేపట్టాలి

జీ బ్లాకులో తమకు కనీస మౌలిక వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు. తాగునీరు లేక మినరల్ వాటర్ కొనుక్కోవాల్సివస్తోందని, డ్రెయినేజీ, దోమల సమస్యలు, గంజాయి బ్యాచ్, దొంగల సమస్యలు ఏళ్ల తరబడి అలాగే కొనసాగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని, గంజాయి, ఆకతాయిల బ్యాచ్‌లు, దొంగలను నియంత్రించేందుకు అపార్ట్‌మెంట్‌లకు నాలుగు వైపులా సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని, రాత్రి సమయంలో ప్రత్యేక పోలీసు బీట్లను ఏర్పాటుచేయాలని వారు ప్రాధేయపడుతున్నారు.

వర్షాకాలానికి సమగ్ర ప్రణాళిక రూపొందించండి

అధికారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించి తనకు సమర్పించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్ శాఖాధిపతులు, సిబ్బంది, సచివాలయం సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంసీ పరిధిలోని ఆయా సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని శాఖాధిపతులను ఆదేశించారు. నగర పరిధిలోని మూడు నియోజకవర్గాలలో సచివాలయం, వార్డు, నియోజకవర్గ వారీగా వర్షం పడినప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తుతాయి, వాటికి పరిష్కారానికి తీసుకునే చర్యలు, శాశ్వత పరిష్కారానికి ఏం చేయాలి వంటి అంశాలతో పూర్తి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో, ప్రమాదకరమైన గుంతలు ఎక్కడున్నాయో, ఎన్ని ఉన్నాయి వంటి వాటిపై పూర్తి నివేదికను సమర్పించి నిర్దేశించిన గడువులోగా వాటిని పరిష్కరించాలన్నారు. వర్షం పడినప్పుడు ఎక్కువగా రోడ్లపై నీరు నిల్వ ఉండే ప్రాంతాలను, రోడ్లు గుంతలు పడిన ప్రాంతాలను గుర్తించి వెంటనే వాటిని పరిష్కరించేందుకు చేపట్టాల్సిన చర్యలను, వర్షపు నీటిని తోడేందుకు వాహనాలను కేటాయించాలని, అవి సరిపోకపోతే అదనంగా వాహనాలను సమకూర్చాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. వర్షం పడినప్పుడు రోడ్లలో ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండి ప్రజలకు ప్రమాదం కలిగే అవకాశం ఉందని, ప్రమాదకరమైన గుంతలు ఉన్న రోడ్లలో గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఒకవేళ చర్యలు తీసుకునే లోపు వర్షం కురిస్తే హెచ్చరిక బోర్డులను పెట్టాలని అన్నారు. నగరానికి వరదలు వస్తే ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ముందస్తుగానే వారికి సమాచారాన్ని అందించి పునరావాస కేంద్రాలకి తరలించేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు నగరంలో ఉన్న కాలువల్లో డీసిల్టింగ్ ప్రక్రియను శరవేగంగా నిర్వహించి పూర్తిస్థాయిలో డీసిల్టింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియ అని, ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ చేయాలన్నారు. నగరంలో ఉన్న డ్రైన్‌లలోనే కాకుండా, ఆ డ్రైన్లు కలిసే అవుట్ ఫాల్ డ్రైన్ ప్రవాహం ఉన్న చివరి వరకు డీసిల్టింగ్ ప్రక్రియ జరగాలని అధికారాలను ఆదేశించారు.

భక్తులకు మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు చర్యలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై భక్తులకు కల్పించే మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు దేవస్థానం చర్యలు చేపట్టింది. దేవస్థానంలోని పలువురు అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ ఆలయ ఈవో శీనానాయక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. వీరికి రోజు వారి విధులతో పాటు అదనపు విధులు నిర్వహిస్తారని ఈవో పేర్కొన్నారు. ప్రసాదాల నాణ్యత, సరుకుల నాణ్యత పరిశీలన, నాణ్యత ప్రమాణాలపై నోడల్ అధికారిగా ఏఈవో ఎన్. రమేష్‌బాబును నియమించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పనితీరు, కంట్రోల్ రూమ్ తనిఖీ, ఆపరేటర్ల విధుల నియంత్రణపై నోడల్ అధికారిగా దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావును నోడల్ అధికారిగా నియమించారు. దేవస్థానంలో భక్తులకు అవసరమైన సమాచార బోర్డులు, డిజైన్ తదితర పనులకు నోడల్ అధికారులుగా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కె. గంగాధర్, డీఈ బి. అశోక్‌కుమార్‌ను నియమించారు. చంటి బిడ్డలకు పాలు ఇచ్చే బేబీ ఫీడింగ్ రూమ్స్ ఏర్పాటు, సౌకర్యాల పర్యవేక్షణకు డీఈ. బి. అశోక్‌కుమార్‌ను నియమించారు. దేవస్థానంలో భక్తులకు రక్షిత మంచినీరు అందించడం, నీటి పరీక్షలు, ట్యాంకులను శుభ్రపరచే అంశాలను పర్యవేక్షించేలా ఎఈ వి.కుటుంబరావును నోడల్ అధికారిగా నియమించారు. దేవస్థానానికి విచ్చేసే భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ, క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణకు ఎఈ సీహెచ్. సునీల్ కుమార్, ఐటీ కోర్డినేటర్ పి. హరీష్‌ను నోడల్ అధికారిగా నియమించారు.

స్కానింగ్, టికెట్ పంచింగ్ పాయింట్లలో ఈవో తనిఖీలు



టికెట్ పంచింగ్ పాయింట్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈవో శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని స్కానింగ్, టికెట్ పంచింగ్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. దీంతో ఉదయం 10-30 గంటల నుంచి అంతరాలయ దర్శనాలను రద్దు చేశారు. రూ.300 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు రూ.300, రూ.100, సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏఈవో చంద్రశేఖర్ రద్దీకి అనుగుణంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనాలు కల్పించారు. మరో వైపున ఈవో శీనానాయక్ గాలిగోపురం వద్ద ఉన్న స్కానింగ్ పాయింట్, ఆలయ ప్రాంగణంలోని టికెట్ పంచింగ్ పాయింట్‌లో భక్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులందరూ తప్పనిసరిగా టికెట్ కొనుగోలు చేసేలా చూడాలని ఈవో ఆదేశించారు. అనంతరం రాజగోపురం వద్ద ఉచిత ప్రసాదాల పంపిణీని పరిశీలించారు. ఉచిత ప్రసాదాల వద్ద భక్తులకు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

శాతవాహన కళాశాల భూవివాదాన్ని నిగ్గుతేల్చాలి

- కలెక్టర్ జోక్యం చేసుకుని అన్యాక్రాంతం కాకుండా చూడాలి
- ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజావసరాలకు వినియోగించాలి
- మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంతో ప్రతిష్టాత్మకమైన శాతవాహన కళాశాల స్థల భూవివాదాన్ని జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని కోర్టు తీర్పుల ప్రకారం అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తాజాగా శాతవాహన కళాశాల భూవివాదం నేపథ్యంలో ఆయన స్పందించారు. 1971లో స్థాపించిన శాతవాహన కళాశాలను అనేక మంది పెద్దలు కలిసి విద్యాభివృద్ధికి సొసైటీగా మార్చారని అన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని, అంతటి ప్రాముఖ్యత కలిగిన కళాశాల కొంతమంది అధికార పార్టీ నేతల ధనదాహం వల్ల వివాదం కావడం విచారకరమన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ కళాశాలను నడిరాత్రి బుల్డోజర్‌తో కూల్చడం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసు యంత్రాంగం ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో తెలియజేయాలని డిమాండ్ చేశారు. కొద్దిరోజుల క్రితం కళాశాల ప్రిన్సిపాల్ అపహరణ మీద అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు కళాశాలను కూల్చే ప్రయత్నం జరిగేది కాదన్నారు. రూ.500 కోట్ల విలువైన కళాశాల భూమిని ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుని, ప్రజల అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హెల్మెట్ వాడితే ప్రాణాలకు భరోసా

మూడవ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు భరోసా ఉంటుందని మూడవ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు అన్నారు. శుక్రవారం సత్యనారాయణపురం పరిధిలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారు, హెల్మెట్‌ను సరిగా ధరించని వాహనదారులను గుర్తించి హెల్మెట్ ధరించే సరైన విధానాన్ని డెమో రూపంలో చూపించారు. అనంతరం వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, బీమా తదితర డాక్యుమెంట్లు పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎవరైనా ట్రాఫిక్ ఉల్లంఘనలు, అతివేగం, హెల్మెట్ వాడకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి వారిని ఆటోమేటిక్‌గా గుర్తించి ఆన్‌లైన్ ద్వారా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.వి.ఎన్.కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరుచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ఓఎస్‌డీ వెలగా జోషి అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గత 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. పోరంకి విజ్ఞాన భారతి స్కూల్ డైరెక్టర్ కొడాలి శేషాద్రి రావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను ఉపయోగించుకొని మంచి విజ్ఞానవంతులుగా తయారు కావాలని కోరారు. ఆర్ట్ మేట్ అకాడమీ డైరెక్టర్ ఎ.సునీల్‌కుమార్ మాట్లాడుతూ చిత్రలేఖనం నేర్చుకోవడం వలన సృజనాత్మకత పెరిగి వినూత్నంగా ఆలోచించడం అలవడుతుందన్నారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి వికాస వాహిని సంస్థ అధ్యక్షులు వేములపల్లి కేశవరావు, టీచర్ స్వాతి పూర్ణిమ, గ్రంథాలయ అధికారి కె.నాగరాజు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా దాడికి పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. టేలర్‌పేట వీరయ్య వీధికి చెందిన జనమాల సునీతకు ఇద్దరు కుమారులు. సునీత భర్త రమేష్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తూ కొంత కాలం కిందట మృతిచెందారు. ఈ నేపథ్యంలో కారుణ్య నియామకం కింద ఆయన పెద్ద కుమారుడు నవీన్‌కుమార్‌కు ఉద్యోగం ఇచ్చారు. కొద్దికాలంగా నవీన్‌కుమార్‌కు, అతని భార్య చైతన్యకు గొడవలు జరుగుతుండడంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో చైతన్య తల్లిదండ్రులు, బంధువులు గురువారం ఉదయం సునీత ఇంటికి వచ్చి నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చైతన్య తల్లి రత్న సులోచన, చిన్నమ్మ రవణతోపాటు మరి కొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీయూ సీనియర్ నేత ప్రభాకర్‌రావు మృతి



ముల్లంగి ప్రభాకర్‌రావు (58)

కంకిపాడు: ఎస్టీయూ సీనియర్ నేత, హెచ్ఎం ముల్లంగి ప్రభాకర్‌రావు (58) శుక్రవారం ఉదయం గుండెపోటుతో కంకిపాడులోని తన నివాసంలో మృతి చెందారు. పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎంగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఉంగుటూరు మండలం ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కొద్దిరోజుల క్రితం వచ్చారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభాకర్‌రావు గతంలో ఉంగుటూరు విద్యాశాఖ అధికారిగా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. ప్రభాకర్‌రావు మృతి విషయం తెలుసుకున్న ఎస్టీయూ నేతలు పీకా ఇమ్మానుయేలు, కొమ్ము ప్రసాద్, మండవ గౌరీప్రసాద్, దేవరపల్లి విద్యాసాగర్, యు.టైటస్‌పాల్, అద్దేపల్లి విజయ్‌కుమార్, పచ్చిగళ్ల సురేష్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు, జల మోహన్‌గాంధీ, పరసా ఆనందరావు తదితరులు ప్రభాకర్‌రావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామమైన చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి తరలించారు.

ముస్లింలకు మల్లాది విష్ణు బక్రీద్ శుభాకాంక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పవిత్రమైన బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని సెంట్రల్ నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సహనం వంటి సద్గుణాల సందేశమే బక్రీద్ అని, నమ్మిన సిద్ధాంతం కోసం చివరికి ప్రాణ త్యాగానికి సిద్ధపడిన దైవ ప్రవక్త హజరత్ ఇబ్రహీం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. భక్తిని, త్యాగ గుణాన్ని బక్రీద్ చాటి చెబుతుందని, సన్మార్గంలో జీవనాన్ని కొనసాగించే సందేశాన్ని మానవాళికి అందిస్తుందని అన్నారు. తమకు ఉన్న దాంట్లో ఇతరులకు పంచిపెట్టడం కంటే మించిన దాతృత్వం లేదనే స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. ఈ పండుగ అందరి జీవితాలలో సరికొత్త ఆనందాలు నింపాలని, అల్లాహ్ దీవెనలతో నియోజకవర్గ ప్రజలకు సకలశుభాలు కలగాలని ఆకాంక్షించారు.

వీఎంసీ కబేళాలో జంతు వధకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

పటమట(విజయవాడతూర్పు): బక్రీద్ సందర్భంగా వీఎంసీ పరిధిలోని ప్రాంతాల్లో వీఎంసీ నుంచి లైసెన్స్ పొందిన స్లాటర్‌హౌస్(కబేళా)లో తప్ప మరే ఇతర అనధికారిక వ్యక్తి, సంస్థలు జంతువధ చేయకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం బక్రీద్ సందర్భంగా పశువధ నిర్వహించుకోవటానికి నగరపాలక సంస్థ కబేళాలో అందుకు అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించామని వివరించారు. కబేళాకు ఎక్కువ మంది కాకుండా కేవలం ఒక జీవానికి ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఇస్తున్నామని, దీన్ని నగరవాసులు గమనించాలన్నారు. విజయవాడ నగరంలో గోహత్య నిషేధ చట్టం అమలులో ఉందని, దీని ప్రకారం ఆవులను చంపడం చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. నగరంలో బీఫ్ వ్యాపారులు విధిగా పై సూచనలు పాటిస్తూ, అధికారులతో సహకరించి ప్రభుత్వం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తమ వ్యాపారాలు చేసుకోవచ్చని సూచించారు.

మ్యాన్‌హోల్ వద్ద శుభ్రం చేశారు!



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): నగర పాలకసంస్థ అధికారులు స్పందించారు. బావాజీపేట ఒకటో లైనులో యూజీడీ మ్యాన్‌హోల్ వద్ద రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన వ్యర్థాలను శుక్రవారం తొలగించారు. ఇక్కడ మ్యాన్‌హోల్ మరమ్మతులలో భాగంగా వచ్చిన వ్యర్థాలను రోడ్డుపైనే వదిలివేయటంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాలను వివరిస్తూ ‘సాక్షి’ శుక్రవారం ‘‘వ్యర్థాలను తొలగించండి’’ శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన యూజీడీ విభాగం అధికారులు ఆ ప్రదేశంలో శుభ్రం చేశారు. శుభ్రం చేసిన వ్యర్థాలను మాత్రం తొలగించలేదు. అయితే రాకపోకలకు వీలుగా మాత్రం సరిచేశారు.

జగన్మాతకు నృత్యార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నందికొట్కూరుకు చెందిన శ్రీలిఖిత నృత్య కళాశాలకు చెందిన విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై డి.సాయి లిఖిత పర్యవేక్షణలో 9 మంది విద్యార్థులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.